క్లుప్తంగా

ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు విద్యతోపాటు, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని డాక్టర్ వీరఅభినవ్, చలసాని అనూష అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లి హరితతో కలిసి వీరఅభినవ్, అనూష రెడ్‌సర్కిల్‌లోని బిషప్ అజరయ్య స్కూల్ విద్యార్థినులకు శుక్రవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచి ఆహార అలవాట్లు చేసుకోవడం, రోజూ వ్యాయామం, యోగా చేయాలన్నారు. జంక్స్ ఫుడ్స్ కాకుండా ఇంట్లో తయారు చేసిన ఆహార పదార్థాలను తినాలని సూచించారు. ఇలాంటి సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఏఐ జయశ్రీ, లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఫర్స్ కమ్యూనికేషన్ కొండవీటి సాయిబాబు, కోటా ఫణీంద్రబాబు, పొన్నాడ ప్రసాద్, అంకాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దత్తసాయి మందిర వార్షికోత్సవం




మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీ దత్తసాయి మందిరం 10వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం 5.15 గంటలకు కాకడ హారతితో వేడుకలు మొదలయ్యాయి. శ్రీసాయి నక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి అఖండ తారక నామ మహామంత్ర పారాయణం జరిగింది. కాగిత సముద్రవేణి భక్తబృందం చేసిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.

ఉత్సాహంగా మయూఖ 2కే 25



లబ్బీపేట(విజయవాడతూర్పు): ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీఎంఏ స్టూడెంట్స్ కన్వెన్షన్ మయూఖ 2కే 25 ఉత్సాహంగా జరిగింది. ఎంజీ రోడ్డులోని శేషసాయి కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో కామర్స్‌తో తమకు ఉన్న పట్టు, ప్రతిభను నిరూపించుకున్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ బిభూతి భూషణ్‌నాయక్, వైస్ ప్రెసిడెంట్ టీసీ ఎ.శ్రీనివాసప్రసాద్, ముంబయి, కోల్‌కతా, చెన్నై, పుణే, బెంగళూరు, హైదరాబాద్, కౌన్సిల్ రీజినల్ కౌన్సిల్ మెంబర్స్ పాల్గొన్నారు. స్థానిక ప్రతినిధి సుంకర నాగపూర్ణిమ పర్యవేక్షించారు.

'ఎగ్జిబిట్'లో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నగరంలోని నలంద డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన ఎగ్జిబిట్-2025 పేరుతో నిర్వహించిన వివిధ పోటీల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులను పొందారని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. బహుమతులు పొందిన విద్యార్థులను కళాశాల ఆవరణలో శుక్రవారం అభినందించారు. క్విజ్, పీపీటీ ప్రజెంటేషన్‌లో మొదటి బహుమతిని, ట్రెజర్ హంట్, ఐ ఆన్ ది బాటిల్, అంత్యాక్షరి పోటీల్లో రెండో బహుమతిని సాధించారని తెలిపారు. బహుమతులు పొందిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ సి.జంపాల, అధ్యాపకులు ఐవీ వెంకటేశ్వరరావు, విద్యార్థులు అభినందించారు.

ముగిసిన సాంకేతిక సదస్సు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న అజూర 2కే 25 సాంకేతిక సదస్సు శుక్రవారం ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య మాట్లాడుతూ సాంకేతిక సదస్సుల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చన్నారు. ఈసీఈ విభాగం విద్యార్థులకు పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, ట్రెజర్ హంట్ పోటీలు నిర్వహించారు.

కాలువ కష్టాలు..

- సింగ్‌నగర్, న్యూఆర్‌ఆర్‌పేట, వాంబే కాలనీ ప్రాంతాల్లో ధ్వంసమైన డ్రెయిన్లు
- ఇళ్ల ముంగిటే మురుగు
- ప్రజలకు తప్పని అవస్థలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ పరిసరాల్లో డ్రెయిన్ల ఇబ్బందులు ప్రజలకు తొలగడం లేదు. ఇళ్ల ముంగిట మురుగు నిలిచిపోతోంది. స్థానిక 57, 58, 59, 60 డివిజన్ల పరిధిలోని సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరిపేట, వాంబేకాలనీ పరిసర ప్రాంతాల్లో సైడ్ డ్రెయిన్లు సరిగా లేకపోవడంతో స్థానికుల పాలిట శాపంగా మారుతున్నాయి. ప్రధానంగా బుడమేరు వరదల తర్వాత ఇక్కడి డ్రెయిన్ల పరిస్థితి అధ్వానంగా మారడం.. నెలల తరబడి మురుగు ఇళ్ల ముందే నిలుస్తోంది.

కదలని మురుగు

నెలల తరబడి డ్రెయిన్లలో మురుగు కదలక వాటి నుంచి వస్తున్న దుర్వాసనతో స్థానికులు ఇళ్లల్లో ఉండలేని దుస్థితి ఏర్పడుతోంది. వీటికి తోడుగా దోమల సమస్య కూడా విపరీతంగా పెరిగిపోయింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమలు స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

- డ్రెయిన్ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో డ్రెయిన్ల పరిస్థితి కొన్ని చోట్ల అధ్వానంగా ఉంటే మరికొన్ని ప్రాంతాల్లో అసలు డ్రెయిన్ల నిర్మాణాలే లేవు. దీంతో మురుగు ముందుకు కదిలే దారి లేక ఇళ్ల ముందుకు, రోడ్లపైకి పారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నిలవకుండా పూడికలు తీయించాలని చెప్పినా.. కాలువలు సరిగా పారేలా చూడాలని చెబుతున్నా సంబంధిత శానిటరీ విభాగ అధికారులు పట్టించుకోవడం లేదని ఈ ప్రాంతాల వాసులు కలత చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు డ్రెయిన్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి, పగిలిపోయిన డ్రెయిన్ల స్థానంలో కొత్తవాటిని నిర్మించాలని కోరుతున్నారు.





సింగ్‌నగర్‌లో డ్రెయిన్ల నిర్మాణం లేక ఇళ్ల ముందు నిలిచిపోతున్న మురుగు

దుర్వాసనతో ఉండలేకపోతున్నాం



మా ప్రాంతాల్లో డ్రెయిన్లు సరిగా లేవు. దీంతో మురుగు ముందుకు పారడం లేదు. నెలల తరబడి మురుగు అలానే ఇళ్లముందు ఉంటుండడంతో వాటి నుంచి దుర్వాసన వస్తోంది. ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం. దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. వీటితో రాత్రిళ్లు నిద్ర కరవవుతోంది.

– కనకదుర్గ, సింగ్‌నగర్

డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టాలి



దశాబ్దాల క్రితం నిర్మించిన కాలువలు కావడంతో ఇవి చాలా చోట్ల పగిలిపోయాయి. కొన్ని రోడ్లలో డ్రెయిన్లే నిర్మించలేదు. మురుగు మొత్తం పొంగి రోడ్లపైకి, ఇళ్ల ముందుకు ప్రవహిస్తున్నాయి. కొత్తగా డ్రెయిన్లు నిర్మించి మురుగు పారడానికి చర్యలు తీసుకోవాలి.

– కామేశ్వరి, సింగ్‌నగర్

త్వరితగతిన ప్రజా సమస్యల పరిష్కారం

పటమట(విజయవాడతూర్పు): త్వరితగతిన ప్రజా సమస్యలు పరిష్కరించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. శుక్రవారం ఆయన సర్కిల్-2 పరిధిలోని గోపాల్‌రెడ్డి రోడ్డు, సర్కిల్-1 పరిధిలోని కెనాల్‌రోడ్డు, సర్కిల్-3 పరిధిలోని ఏపీఎస్ ఆర్‌ఎం స్కూల్ వద్ద ఉన్న అన్న క్యాంటిన్‌ను పరిశీలించారు. 23వ డివిజన్ ఎన్టీఆర్ కాంప్లెక్స్, గోపాల్ రెడ్డి రోడ్డు ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణలో అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంప్లెక్స్ వద్ద ఉన్న యూరినల్స్ తొలగించి మరుగుదొడ్డిని నిర్మించాలని తానిచ్చిన ఆదేశాలను బేఖాతర్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా మరుగుదొడ్డిని నిర్మించాలని ఆదేశించారు. అనంతరం ఆయన వినాయకుని గుడి, కెనాల్ రోడ్డు, భవానీపురంలోని హోల్డింగ్ ఏరియా ప్రాంతంలో పర్యటించారు. దసరా ఉత్సవాలు, భవానీలకు శాశ్వతమైన మరుగుదొడ్లను హోల్డింగ్ ఏరియాలో నిర్మించాలని ప్రణాళికలను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. నగరంలో ఉన్న వంతెనలకు కీ ఫెన్సింగ్ వేయాలని, వాటికి పెయింటింగ్ వెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని తు.చ. తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం సర్కిల్ 3 పరిధిలో కృష్ణలంకలో ఉన్న ఏపీఎస్‌ఆర్‌ఎం స్కూల్ వద్ద ఉన్న అన్న క్యాంటిన్ పరిశీలించి ప్రతిరోజూ నోడల్ అధికారులు క్యాంటిన్‌లను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇంచార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు పి. సత్యనారాయణ, పి.సత్యకుమారి, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, సామ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.



నగరంలో పారిశుద్ధ్య విధానాన్ని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

మహిమాన్వితం మేరీమాత పుణ్యక్షేత్రం

గుణదల(విజయవాడ తూర్పు): మహిమాన్వితం మేరీమాత పుణ్యక్షేత్రమని ప్రావిన్షియల్ సుపీరియర్ ఫాదర్ బలుగూరి రాజు అన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో జరుగుతున్న నవదిన ప్రార్థనల్లో ఎనిమిదో రోజు శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మరియమాతను ఆశ్రయించిన వారికి సకల ఆశీర్వాదాలు లభిస్తాయన్నారు. భక్తుల కోర్కెలను భగవంతునికి చేర్చుతూ ఆమె ప్రార్థిస్తుందన్నారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. తొలుత పలు విచారణల నుంచి వచ్చిన గురువులు, మఠకన్యలు, భక్తులు కొవ్వొత్తులు, జపమాల ధ్యానంతో కొండ పైకి చేరుకున్నారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, ఫాదర్ సునీల్ రాజు తదితరులు పాల్గొన్నారు.



దివ్య సత్ప్రసాద ఆరాధనతో ఆలయ గురువులు

ఆధునిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. స్థానిక మాచవరం ఎస్ ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల భౌతిక శాస్త్రం, ఎలక్ట్రానిక్స్ శాఖల ఆధ్వర్యంలో సర్క్యూట్ డిజైన్ అండ్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు (పీసీబీడిజైన్) పై వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని చేస్తే ఎక్కువగా నేర్చుకోవచ్చన్నారు. ఇక్కడ నేర్చుకున్న ఎలక్ట్రానిక్ వలయాలను ఇంటిలో అనువర్తనాలుగా ఉపయోగించి నీటి దుర్వినియోగం తగ్గించవచ్చునన్నారు. వర్క్‌షాప్‌లో స్మార్ట్ హోమ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ తరపున ఎస్. ప్రదీప్ కుమార్, లావణ్య నలభై మంది విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్ బోర్డులను డిజైన్ చేయడం, కంప్యూటర్ పై వాటి ప్రతిబింబాలను డిజైన్ చేయించి రాగి బోర్డులపై ఎలక్ట్రానిక్ సర్క్యూట్ లను తయారు చేయించారు. వీటితో నీటి ట్యాంకు నిండినపుడు గుర్తించే సూచి, కాంతి, వేడి, వాయువులను గుర్తించే సెన్సర్ సూచి వంటి వాటికి ఎలక్ట్రానిక్ వలయాలను తయారుచేయించారు. అనంతరం భౌతిక శాస్త్రం, ఎలక్ట్రానిక్స్ శాఖలు స్మార్ట్ హోమ్ – ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ మధ్య అవగాహన పత్రాన్ని మార్చుకున్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. శైలజ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో పీసీబీడిజైన్ వర్క్‌షాప్

ఆక్రమణల తొలగింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురంలో బుడమేరు పక్కన ఆక్రమణలను టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. ఇటీవల బుడమేరు పక్కన ఆక్రమణలు పెరిగిపోయాయి. యథేచ్ఛగా ఆక్రమణలు చేసి ఫెన్సింగ్ వేశారు. దీనిపై 'సాక్షి' కథనాలు ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు శుక్రవారం ఆక్రమణలు తొలగించారు. మరోసారి ఇలా చేసేకఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తొలగింపులో ప్లానింగ్ సెక్రటరీ సునీల్ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ మారుకు అంతిమ వీడ్కోలు

పటమట(విజయవాడతూర్పు): అనారోగ్యంతో మరణించిన గోరా కుమార్తె, డాక్టర్ జి. మారు అంత్యక్రియలు శుక్రవారం నగరంలోని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ వద్ద ఉన్న శ్మశాన వాటికలో జరిగాయి. ఆమె మరణ వార్త తెలిసి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన సన్నిహితులు, నాస్తికులు, వైద్య రంగ ప్రముఖులు పెద్దసంఖ్యలో నగరంలోని నాస్తిక కేంద్రానికి వచ్చి మారు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. గోరా కుటుంబం నాస్తిక ఉద్యమంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మారు భర్త హరి సుబ్రహ్మణ్యం, కుమారుడు ఓలాస్ గోరా, డాక్టర్ సమరంను పరామర్శించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబురావు, డి.రమాదేవి, ప్రోగ్రెసివ్ ఫోరం కార్యదర్శి చంద్రరావు, సీనియర్ సిటిజన్స్ సంఘం కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, నాస్తికులు అరుణకుమార్, డాక్టర్ రమేష్, జన చైతన్య వేదిక అధ్యక్షులు లక్ష్మణ రెడ్డి, తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.



మారుకు నివాళులర్పిస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ

నైతిక విలువల పెంపునకు ఖురాన్ కంఠస్థ పోటీలు

మొహమ్మద్ దావుద్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాల్యం నుంచే పౌరుల్లో నైతిక విలువల పెంపునకు ఏటా ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఖురానిక్ స్టడీస్ చైర్మన్ మొహమ్మద్ దావూద్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖురాన్ పఠనం ఆవశ్యకతను తెలియజేశారు. 10వ పవిత్ర ఖురాన్ కంఠస్థ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మానవుడు సాధించిన అభివృద్ధి సమాజానికి ఉపకరిస్తున్న సోషల్ మీడియాలో అనవసరమైన అంశాలు చిన్నారుల మదిలో విషబీజాలు వేస్తున్నాయన్నారు. దారి తప్పుతున్న బాల్యాన్ని ప్రాథమిక దశలో దైవత్వం వైపునకు మళ్లించే లక్ష్యంతో ఫోరం ఆధ్వర్యాన పదేళ్లుగా ఖురాన్ పారాయణం పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయి నుంచి మొదలుకొని జిల్లాస్థాయి వరకు చిన్నారులకు పోటీలను నిర్వహిస్తూ రాష్ట్ర స్థాయి పోటీలకు 44 మందిని ఎంపిక చేశామన్నారు. వీరికి ఈ నెల 9న విజయవాడ ఆటోనగర్‌లో ఫైనల్స్ పోటీలు జరుగుతాయన్నారు. సమావేశంలో షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



ఖురాన్ పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

సర్పంచ్, అతని అనుచరుల నుంచి రక్షణ కల్పించండి

వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత జాయింట్ కమిషనర్ పుల్లా జకరయ్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రూరల్ మండలం అంబాపురం సర్పంచ్, అతని అనుచరుల నుంచి తనకు రక్షణ కల్పించాలని వాణిజ్య పన్నులశాఖ విశ్రాంత జాయింట్ కమిషనర్ పుల్లా జకరయ్య వేడుకున్నారు. తన స్థలాన్ని కబ్జా కాకుండా కాపాడాలని కోరారు. శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబాపురంలోని సర్వే నంబర్ 96/2బి 2597.44 చదరపు గజాల భూమిని 2024లో దాట్ల ఝాన్సీరాణి వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. తన స్థలాన్ని సర్పంచ్ గండికోట సీతయ్య, అతని అనుచరులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. తన స్థలానికి పక్కనే ఉన్న పార్క్ స్థలంలో కలిపేసి కాజేయడానికి చూస్తున్నారన్నారు. రెండు, మూడు సార్లు దౌర్జన్యంగా స్థలంలోకి ప్రవేశించారన్నారు. కోర్టును ఆశ్రయిస్తే తనకు అనుకూలంగా హైకోర్టు ఆర్డర్ ఇచ్చిందన్నారు. ఈ నెల 3వ తేదీ స్థలాన్ని బాగు చేస్తున్నప్పుడు వారొచ్చి దాడికి యత్నించారన్నారు. 4వ తేదీ రాత్రి వేళ మద్యం తాగి స్థలానికి వాచ్‌మెన్‌గా ఉన్న దొండపాటి దాసుపై దాడి చేశారన్నారు. స్థలంలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్‌ను, నోటీసు బోర్డులను ధ్వంసం చేశారన్నారు. సర్పంచ్ సీతయ్య, అతని అనుచరులు వసంత్‌కుమార్, గురవయ్యల నుంచి తనకు ప్రాణహాని ఉందన్నారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని రక్షణ కల్పించాలని, స్థలాన్ని కాపాడాలని ఆయన వేడుకున్నారు.

అది అంబాపురం పంచాయతీ కామన్ స్థలం

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం పంచాయతీలోని ఎఫ్‌సీఐ ఎంప్లాయిస్ కాలనీలో రూ.20 కోట్ల విలువైన 2,226 గజాల స్థలాన్ని రిటైర్డ్ అధికారి పి.జకరయ్య అనే వ్యక్తి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని సర్పంచి గండికోట సీతయ్య ఆరోపించారు. అంబాపురం ఒకటవ లైన్లో హైకస్ హైట్స్ లో శుక్రవారం నిర్వహించిన విలేకురుల సమావేశంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు, లీగల్ బోర్డ్ కార్యదర్శి వేణు, కాలనీ వాసులు పాల్గొన్నారు. పంచాయతీలోని ఎఫ్‌సీఐ ఎంప్లాయిస్ కాలనీ (విజయవాడ ఇన్నర్ రింగ్‌రోడ్డు వెంబడి)ఉన్న కామన్ స్థలాన్ని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నారని, వాస్తవానికి అది పంచాయతీ స్థలమని వారు చెప్పారు. దానిలో తాగునీటి ట్యాంక్ నిర్మాణానికి గతంలోనే పంచాయతీ తీర్మానం చేసిందని సర్పంచి తెలియచేశారు. ఈ స్థలంలో కొంత పార్కు ఏర్పాటు చేశారని, కొందరు స్థలం కబ్జా చేయగా హైకోర్టు ఆదేశాల మేరకు వారంతా ఖాళీ చేశారని వివరించారు. ఇప్పుడు మళ్లీ పుల్లా జకరయ్య అనే వ్యక్తి కొంత మంది పలుకుబడి నేతలతో కలసి కబ్జాకు పాల్పడ్డారని ఆరోపించారు. వాటర్ ట్యాంక్ నిర్మించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి వాటర్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని చెప్పారు. స్థలం డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని, రిటైర్డ్ ఉద్యోగి ఈ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయడం బాధాకరమన్నారు. పోలీసులు తనపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని దీని పై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఎఫ్‌సీఐ ఎంప్లాయీస్ సొసైటీ అధ్యక్షుడు దండమూడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి రెడ్డి, కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, నాయక్, అంబాపురం డెవలప్‌మెంటు కమిటీ సభ్యులు మోహన్,కోటేశ్వరరావు పాల్గొన్నారు.


పేరుకుపోతున్న గుర్రపు డెక్క

విజృంభిస్తున్న దోమలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరులో గుర్రపు డెక్క పేరుకుపోయి దోమలకు ఆవాసకేంద్రంగా మారింది. గతంలో బుడమేరులో గుర్రపు డెక్కను నిత్యం తొలగిస్తూ ఉండేవారు. ఇటీవల తొలగింపు పనులు సక్రమంగా జరగడం లేదు. దేవీనగర్ ఫుట్‌బ్రిడ్జి వద్ద గుర్రపు డెక్క భారీగా పేరుకుపోయింది. అయినా మలేరియా విభాగం సిబ్బంది కనీస చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బుడమేరులో గుర్రపు డెక్క పేరుకుపోవడంతో రోజు రోజుకు దోమలు పెరిగిపోవడంతో కనీసం బయట అడుగు పెట్టలేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. దోమలు పెరిగిపోతున్నాయని అధికారులకు చెబితే జనవరి, ఫిబ్రవరి నెలలు అంతేనంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు. దేవీనగర్, జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, బుడమేరు మధ్యకట్ట, మధురానగర్ తదితర ప్రాంత వాసులు దోమలతో అల్లాడుతున్నారు. అధికారులు స్పందించి దోమల నివారణ చర్యలు వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బుడమేరులో సెప్టిక్, మురుగు వ్యర్థాలు

బుడమేరు మధ్యకట్టలోని నివాసితులు సెప్టిక్, మురుగు వ్యర్థాలను నేరుగా బుడమేరులోకి వదలివేస్తున్నారు. దుర్వాసనతో పాటు దోమలు మరింతగా పెరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. బుడమేరులోకి సెప్టిక్ వ్యర్థాలు వదలకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బుడమేరులో పేరుకుపోయిన గుర్రపు డెక్క

అత్యాధునికంగా పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్



లబ్బీపేట(విజయవాడతూర్పు): రెండున్నర దశాబ్దాలుగా వైద్య సేవలు అందిస్తున్న పెద్దేశ్వర్ హెల్త్‌కేర్ సెంటర్‌లో ఇప్పుడు మల్టీ స్పెషాలిటీ, ట్రామా, క్రిటికల్ కేర్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్టు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు తెలిపారు. ఆస్పత్రిలో 150 పడకలు ఉండగా, 100 క్రిటికల్ కేర్ బెడ్స్, 8 ఐసీయూలతో రూపుదిద్దుకున్న నూతన ప్రాంగణాన్ని ఈ నెల 9న లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఈ సందర్భంగా సూర్యారావుపేటలోని ఆస్పత్రి ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆస్పత్రి వివరాలు వెల్లడించారు. పాతికేళ్ల క్రితం 20 పడకలతో ప్రస్థానం ప్రారంభమై, వందశాతం సక్సెస్ రేటుతో వైద్యం చేసినట్లు తెలిపారు. ఆస్పత్రి సీఈఓ డాక్టర్ పల్లెం ఆకాష్ మాట్లాడుతూ నూతన ప్రాంగణంలో కార్డియాలజీ, కార్డియోథోరాసిక్ సర్జరీ, పల్మనాలజీ, క్రిటికల్ కేర్, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, ఆర్థోపెడిక్, ట్రామా విభాగాల్లో సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ప్రారంభోత్సవ బ్రోచర్ ఆవిష్కరించారు.

సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం మాఘ మాసం పురస్కరించుకుని సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివజ్ఞాన పీఠంలో శివ సూర్యులకు లక్ష పద్మ బీజార్చన కార్యక్రమం జరిగింది. పీఠాధిపతి శివాచార్య స్వామి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము లోక కల్యాణార్థం లక్ష తామర పూసలతో స్వామివారికి అర్చనలు చేసి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

● ఆకలి చూపులు



అంబాపురంలో కోతులు గుంపులుగా తిరుగుతున్నాయి. పంటపొలాల్లో తిరిగే కోతులు ఇటీవల రోడ్డుపైకి చేరుతున్నాయి. అలాంటి కోతుల గుంపు శుక్రవారం అంబాపురంలో రోడ్డుపైకి వచ్చి వాహనచోదకుల వంక చూస్తూ కూర్చున్నాయి. అవి ఆకలి చూపులు చూస్తుండటంతో అటుగా వెళ్లే కొందరు పండ్లు, ఇతర ఆహార పదార్థాలు వేస్తున్నారు. కోతులు అటూ ఇటూ తిరుగుతూ వాటిని తింటున్న దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ